నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
శుక్రవారం 16 జూన్ 2023

దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష సమావేశం

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మండల అభివృద్ధి అధికారి బాలకిషన్ దశాబ్ది ఉత్సవాలపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 17న నిర్వహించే తెలంగాణ గిరిజన ఉత్సవాల గురించి గిరిజనుల సంక్షేమ కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు, గిరిజనుల చిరకాల వాంఛను తీరుస్తూ తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు, దినోత్సవంనాడు చేయవలసిన కార్యక్రమాలపై వివరించారు. అలాగే 18న చేపట్టే మంచినీళ్ల పండుగ, జూన్ 19న చేపట్టే తెలంగాణ హరితోత్సవం గురించి అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, మాస్ ప్లాంటేషన్‌పై పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రఘురాం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను ఆర్‌ఎంపీ డాక్టర్ల మండల అధ్యక్షులు చికోటి మురళి, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సురేష్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తుల వివరాలు చెప్పగానే స్పందించి నిత్యావసర సరుకులు అందజేసినందుకు వ్యాధిగ్రస్తుల తరపున చీకోటి మురళికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమ్, దోమల శ్రీధర్, శ్రీహరి, పవన్ ఆశాలు వనిత, ప్రమీల, మంజుల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం

- గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు
- పల్లెప్రగతి దినోత్సవంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
- పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సన్మానం



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటులో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం బాన్సువాడ గ్రామీణ మండలం కొల్లూరు గ్రామంలో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులను శాలువాతో సన్మానించారు. అభివృద్ధిలో భాగంగా కొల్లూరు గ్రామంలో రూ.60 లక్షలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన 6 అదనపు తరగతి గదులను, 20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాగారం గ్రామంలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి, రూ.5 లక్షలతో నిర్మించే ముదిరాజ్ సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాలలో దేశంలో అగ్రస్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. గ్రామాలలో అభివృద్ధి, మౌళిక సౌకర్యాల కల్పన కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యధికంగా నిధులను మంజూరు చేస్తుందన్నారు. 2004 నుంచి 2014 వరకు గత ప్రభుత్వాలు గ్రామాలలో మౌళిక వసతుల కోసం రూ.12వేల కోట్లు ఖర్చు చేస్తే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలలో 58 వేల కోట్ల రూపాయల ఖర్చు చేస్తుందన్నారు. ప్రతి గ్రామానికి ట్రాక్టర్, నీళ్ల సరఫరా ట్యాంకర్ పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నాం, వైకుంఠధామాలు, నూతన గ్రామ పంచాయతీ భవనాలు, 45లక్షల మందికి ఆసరా పెన్షన్లు, ఇందులో 4.70 లక్షల మంది బీడీ కార్మికులు ఉన్నారు. పక్కన ఉన్న మహారాష్ట్రలో రూ.1000, కర్ణాటక రూ.600, గుజరాత్‌లో రూ.600, ఉత్తరప్రదేశ్ రూ.400, పశ్చిమ బెంగాల్ రూ.1000 మాత్రమే ఇస్తున్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాలలో 80 ఏళ్ళు దాటితే మాత్రమే పెన్షన్ ఇస్తున్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ పథకం ద్వారా నగదు సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. గర్భవతులకు న్యూట్రిషన్ కిట్ అందిస్తున్నామన్నారు. డెలివరీ తరువాత తల్లి, బిడ్డలకు అవసరమైన 14 రకాల వస్తువులను కేసీఆర్ కిట్ అందిస్తున్నామన్నారు. గురుకులాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థిపై ఏడాదికి రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్ళు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వస్తున్నాయని అన్నారు. నియోజకవర్గంలో పేదల కోసం 100 జనరల్ ఫంక్షన్ హాల్స్ నిర్మిస్తున్నామన్నారు. ఇందులో కిరాయి కేవలం అయిదు వేల రూపాయలు మాత్రమే అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11వేల డబుల్ బెడు రూముల నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో అదనంగా 300 తరగతి గదులు నిర్మించామన్నారు. 150 అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు డి.అంజిరెడ్డి, బాన్సువాడ ఆర్డీఓ రాజాగౌడ్, డీఎస్పీ జగన్నాథరెడ్డి, మండలాధ్యక్షురాలు దొడ్ల నీరజావెంకట్రాంరెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

- ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన
- మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రాకు వినతి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్, బోర్గాం (పి) అల్లూరి సీతారామరాజు కాలనీ వాసులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నగర కమిటీ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. గత 50 సంవత్సరాలుగా 30 కుటుంబాలకు చెందిన సుమారు 150మంది నిరుపేదలు బోర్గం(పి), అల్లూరి సీతారామరాజు కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. వీరికి గతంలోనే స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, కలెక్టర్ల చేతుల మీదుగా ఇండ్ల పట్టాలు ఇచ్చారని, నేటికీ వీరికి విద్యుత్, తాగునీరు సౌకర్యం లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. అధికారులు బోరు తవ్వించినా మోటారు బిగించలేదని, కరెంటు స్తంభాలు వేసినా విద్యుత్ సౌకర్యం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర కార్పొరేషన్ పరిధిలోనే తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేకపోవడం ప్రభుత్వ, జిల్లా అధికారుల అసమర్ధ పాలనకు అద్దం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా వెంటనే తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా స్పందిస్తూ రెండు రోజుల్లో అధికారులను పంపిస్తామని, వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి సాయాగౌడ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, నగర అధ్యక్షులు అశుర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కిరణ్, కాలనీవాసులు బాలరాజు, సాయిలు, శ్రీనివాస్, గణేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాది కా అమృత్ మహోత్సవం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలో జాతీయ రహదారి అథారిటీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అజాదికా అమృత్ మహోత్సవం హైవే ప్రాజెక్టు మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి పోలీసు శాఖతో కలిసి గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో వాహనదారులకు వెహికల్ చట్టంలో జాతీయ రహదారిపై వాహన దారులు ప్రయాణం చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అదే విదంగా వాహన దారులు నిబంధనలను సక్రమంగా పాటించలాని సూచించారు. ఒక వేల వాహనదారులు నిబంధనలు అక్రమిస్తే ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని తెలిపారు. వాహన దారులు జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో నియమ నిబంధనలను తప్పక పాటించి తమ తమ ఇండ్లకు సురక్షితంగా చేరుకోవాలని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ కొనారెడ్డి, ఇన్సిడెంట్ మేనేజర్ ప్రతాప్‌సింగ్, పోలీసు సిబ్బంది, జాతీయ రహదారి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గడికోటలో చిన్నారులకు అక్షరాభ్యాసం


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని గడికోటలో ఫోర్ట్ అండ్ విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ గడికోట వారసులు కామినేని అనిల్ ఆధ్వర్యంలో చిన్నారులకు సరస్వతి పూజ నిర్వహించి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సుమారు 185 మంది పిల్లలు ఈ అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడి కోట వారసులు కామినేని అనిల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువు కొని ఉన్నత స్థాయిలో మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే దోమకొండలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత చదువులను కొనసాగించడానికి ఉపకార వేతనాలు సుమారు రూ.75,000 అందజేశారు. కార్యక్రమంలో గడికోట వారసులు కామినేని అనిల్, జడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, సర్పంచ్ అంజలి, ఉప సర్పంచ్ గజవాడ శ్రీనివాస్, ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎండీఓ తిరుపతిరెడ్డి, సీడీపీవో రోచిష్మ, గడికోట ట్రస్ట్ చైర్మన్ బాబ్జీ, ప్రతినిధులు గణేష్ యాదవ్, శ్రీకాంత్, రాజశేఖర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిరిజన సంబురాలను విజయవంతం చేయాలి

- 17న నసురుల్లాబాద్‌కు స్పీకర్ రాక
- ఎంపీపీ పాల్త్య విఠల్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 17 నసురుల్లాబాద్ మండలంలో నిర్వహిస్తున్న గిరిజన సంబరాలకు రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వస్తున్నారని నసురుల్లాబాద్ ఎంపీపీ పాల్త్య విఠల్, మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ తెలిపారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి రాక సందర్భంగా గురువారం నసురుల్లాబాద్ గిరిజన గురుకుల పాఠశాల ఆవరణ స్థలంను మండల ప్రజాప్రతినిధులతో కలిసి సభ స్థలాన్ని పరిశీలన చేశారు. నసురుల్లాబాద్ మండలంలోని అన్ని గిరిజన గ్రామాల గిరిజనులు సభకు తరలివచ్చేలా చూడాలని, ఇంటింటికీ వెళ్లి కలిసి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి అందరినీ సభకు వచ్చేలా కృషి చేసి సభ ను విజయవంతం చేయాలన్నారు.

సంక్షేమ పథకాల అమలులో

రాష్ట్రం దేశానికే ఆదర్శం

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్


జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-రామారెడ్డి

దేశంలో సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజలకు అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా, మొదటి స్థానంలో నిలిచిందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లెప్రగతి దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో యువకులతో ఉత్సాహంగా క్రికెట్ ఆడారు. స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో జెండాను ఎగరవేశారు. పంచాయతీ సిబ్బందికి శాలువాలతో సన్మానించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఎన్నో సమస్యలు ఉండేవని, తెలంగాణ వచ్చిన తర్వాత చాలా సమస్యలు పరిష్కరిస్తున్నామని, అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు దేశంలో ఎక్కడ కూడా పింఛన్ ఇవ్వటం లేదని, ఒక తెలంగాణ రాష్ట్రంలోనే పింఛన్లు అందజేస్తున్నామని అన్నారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, తెలంగాణ మాదిరిగా ఎందుకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 9 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధితోనే దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రతిపక్షాలు కండ్లులేని కపోతల, దశాబ్ది ఉత్సవాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారని, గ్రామాల్లో అభివృద్ధి పనులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అనంతరం సర్పంచ్ దండ బోయిన సంజీవ్ మాట్లాడుతూ... గ్రామానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని రూ.కోటి నిధులతో సిసి రోడ్లు, రైతు వేదిక, వైకుంఠధామం, కంపోస్టుషెడ్, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం దాదాపు రూ.41లక్షలతో నిర్మించామని, గ్రామపంచాయతీకి రూ.కోటి నిధులతో ఏడు కిలోమీటర్లు డ్రైనేజీ పనులు చేపట్టామని, రెండు పీహెచ్‌సీ సబ్ సెంటర్ భవనాలకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఐమాక్స్ లైట్లు, విద్యుత్ సమస్యల పరిష్కారం, మన ఊరు మన బడిలో భాగంగా బాలికల ఉన్నత పాఠశాలకు రూ.కోటి 20 లక్షలు, బాలుర హై స్కూల్‌కు రూ.కోటి ఆరు లక్షలు, మండల పరిషత్ పాఠశాలకు రూ.58 లక్షలతో గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద అడగగానే రూ.20 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధికి సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీంద్రరావు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వంతోనే బీసీల సంక్షేమం

- ఎమ్మెల్యే షకీల్ ఆమెర్

నవతెలంగాణ-బోధన్/రెంజల్


బోధన్ : కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే బీసీల సంక్షేమం, అభివృద్ధి సంపూర్ణంగా జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని తట్టికోటలో నూతనంగా నిర్మించిన రెడ్డికా కుల సంఘం భవనం ప్రారంభించి ఆయన మాట్లాడారు. బీసీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. బీసీలకు స్వయం ఉపాధి కోసం ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తున్నారని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం బోధన్ పట్టణంలోని కమ్యూనిటీ ఫెసిలిటేటర్ సెంటర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కుట్టు మిషన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గంగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వీఆర్ దేశాయ్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

రెంజల్ : గత పది సంవత్సరాలుగా తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టిందని బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమీర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు మద్దతు ధరతో పాటు, రైతుబీమా, రైతుబంధు, దళిత బంధు, పథకాలతో దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. వికలాంగుల పింఛన్లతోపాటు, వృద్ధాప్య, ఒంటరి మహిళ, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, పథకాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మన రాష్ట్రంలో అత్యధిక శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు. రెంజల్ మండలంలోని పల్లె ప్రగతి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సాటాపూర్ గ్రామంలో శ్మశానవాటిక, ప్రాథమిక ఉపఆరోగ్య కేంద్రం, రైతువేదిక, మార్కెట్‌యార్డ్‌లను ఆయన ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్‌ను మండల నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు భూమారెడ్డి, సర్పంచులు వికార్ భాష, ఎమ్మెస్ రమేష్ కుమార్, మీర్జా కలీం బేగ్, జాదవ్ గణేష్ నాయక్, బైండ్ల రాజు, లలిత రాఘవేందర్, పార్ధవాని సాయిరెడ్డి, సునీత బాబు నాయక్, ఎంపీటీసీలు ఎస్కే అహ్మద్, చింతకుంట లక్ష్మి, గడ్డం స్వప్న సింగిల్ విండో చైర్మన్లు ఇమామ్ బేగ్, మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


రెంజల్ : ఎమ్మెల్యేకు గజమాలతో సన్మానం

తల్లిదండ్రులు మందలించారని

డ్యాంలో దూకి యువకుడు ఆత్మహత్య


యువకుడి మృతదేహం

నవతెలంగాణ-జుక్కల్

తల్లిదండ్రులు మందలించారని మనస్థాపం చెందిన యువకుడు కౌలాస్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సావర్‌గావ్ డ్యాం వద్ద చోటుచేసుకుంది. జుక్కల్ ఎస్సై మురళి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్కుంద మండలం రాజుల్లా గ్రామానికి చెందిన సాయికుమార్ (25) మూడు నెలల క్రితం వివాహమైంది. ఖాళీగా ఇంటివద్దే ఉండటంతో కుటుంబీకులు మందలించారు. మనస్థాపం చెందిన సాయికుమార్ జూన్ 13వ తేదీన ఇంటి నుంచి బిచ్కుంద వెళ్తానని చెప్పి వెళ్లి.. ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. కాగా జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్ట్ వద్ద గురువారం నీటిపైన శవం తేలియాడటంతో ప్రాజెక్ట్ వాచ్‌మెన్ సుధాకర్ పోలీసులకు సమాచారం అందించారు. శవాన్ని తీసి రాజుల్లా గ్రామానికి చెందిన యువకుడు సాయికుమార్ మృతదేహంగా గుర్తించారు. ద్విచక్ర వాహనం నిలిపి ఉంచి నీటిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. తండ్రి బాలింగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించారు.

రైతులకు రసీదుతో కూడిన బిల్లులు ఇవ్వాలి

- ఏడీఏ నూతన్ కూమార్


ఎరువుల డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

నవతెలంగాణ-జుక్కల్

రైతులకు విధిగా రసీదుతో కూడిన బిల్లులు తప్పక ఇవ్వాలని బిచ్కుంద ఏడీఏ నూతన్ కూమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏవో నవీన్ కూమార్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణల యజమానులు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. వానాకాలానికి సంబంధించి అమ్మే విత్తనాలు, ఎరువులు, నాణ్యమైన విత్తనాలను అందించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని ఎరువుల దుకాణాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టండి


ప్లేట్లతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

- భోజనం కోసం విద్యార్థుల భిక్షాటన
- ఖాళీ ప్లేట్లతో టీయూ మెయిన్ గేట్ ఎదుట నిరసన
- నిరవధిక సమ్మెలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

నవతెలంగాణ-డిచ్‌పల్లి

'అన్నం పెట్టండి' అంటూ తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేశారు. టీయూలోని మెస్‌వర్కర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో గత మూడు రోజులుగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. దీంతో టీయూ విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెట్టకపోవడంతో జాతీయ రాహదారి పక్కన గల నడ్పల్లి తండాలో ఇంటింటికీ వెళ్లి.. 'అమ్మా.. అన్నం పెట్టండి' అంటూ విద్యార్థులు భిక్షాటన చేశారు. అంతకుముందు విద్యార్థులు టీయూ మెయిన్ గేటు ఎదుట ఖాళీ ప్లేట్లతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

వివరాలు మెయిన్‌లో..

ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను గురువారం అందజేశారు. బండి పద్మకు రూ.75వేలు, అవారి శారదకు రూ. 30వేల 500 ఆర్థిక సహాయం చెక్కులను సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిప్పేరా అనిల్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవారి మురళి, ఉప సర్పంచ్ నందగిరి రేఖ శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.



జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్‌లో గెలుపొందిన విజయ్ విద్యార్థి

నవతెలంగాణ -ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి విజయ్ హై స్కూల్ లో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి శశాంక్ ఇటీవల అనంతపురం జిల్లాలో నిర్వహించిన జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించినట్టు విజయ్ విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆటలలో అత్యంత మెలకువలు నేర్పిన వ్యాయామ ఉపాధ్యాయులు ఈ సురేష్, ధర్మపురిలను ప్రధానోపాధ్యాయురాలు కవిత దివాకర్ అభినందించారు.



ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరిన కలెక్టర్
- మార్పులు, చేర్పులు గుర్తిస్తే ప్రతిపాదనలు పంపించాలి
- పోలింగ్‌కేంద్రం మార్పు, కొత్తవి ఏర్పాటు అంశాలు ప్రతిపాదించవచ్చు
- జూలై 24లోపు ప్రతిపాదనలు అందించండి


పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ద్వారా రూపొందించిన ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లను గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలతోపాటు రాజకీయ పార్టీల పాత్ర కూడా ఎంతో క్రియాశీలకమైనదని గుర్తు చేశారు. దీనివల్ల ఓటరు జాబితా పక్కాగా రూపకల్పన జరిగి ఎన్నికల సమయంలో ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు చేయాల్సిన ఆవశ్యకతను గుర్తిస్తే ప్రతిపాదనలు అందించాలన్నారు. వాటిని ఎన్నికల అధికారులతో పరిశీలన చేసి సహేతుకమైన వాటిని ఆమోదిస్తూ మార్పులు, చేర్పులు చేస్తామని తెలిపారు. ఎక్కడైనా పోలింగ్ స్టేషన్ మార్చాల్సి ఉన్నా, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలను ప్రతిపాదించవచ్చని సూచించారు. అలాగే ఎక్కడైనా ఒక ప్రాంతానికి చెందిన ఓటర్లను సమీప పోలీంగ్ బూత్ పరిధిలో కాకుండా వేరే దూర ప్రాంతంలోని బూత్ పరిధిలో ఓటరుగా చేర్చినట్టు గుర్తిస్తే, అలాంటి ఓటర్ల వివరాలను అందించాలని అన్నారు. జాబితాలో పేర్లు లేని ఓటర్ల వివరాలతో పాటు, ఓటరు గుర్తింపు కార్డులో ఫొటో సరిగా లేని వాటిని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరు పేరు ఉండడం, ఒక సెగ్మెంట్ ఓటరు పేరు మరో సెగ్మెంట్ ఓటరు జాబితాలో ఉండడం, ఇతరాత్ర మార్పులు, చేర్పుల గురించి కూడా తెలియజేయవచ్చని సూచించారు. వీటికి సంబంధించి జూలై 24లోపు ప్రతిపాదనలు అందిస్తే వాటి ఆధారంగా సవరణలు చేసిన ఓటరు జాబితాతో ఆగస్టు 2 న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తామని కలెక్టర్ వివరించారు. 2023 జనవరి ఒకటవ నాటికి 18 సంవత్సరాలు పూర్తవుతున్న వారి పేర్లు, వివరాలను ఓటరు జాబితాలో చేర్పించాలన్నారు. ఓటరు జాబితాలో బోగస్ ఓటర్లు, డూప్లికేషన్‌లకు తావులేకుండా పకడ్బందీ పరిశీలన జరపాలన్నారు. బూత్ లెవెల్ అధికారులతో నిర్వహిస్తున్న ఇంటింటి పరిశీలనకు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ పాల్గొన్నారు.

2న ప్రతిభా పురస్కారాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న సంఘ సభ్యులు

నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం, నగర పద్మశాలి సంఘం, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు దీకొండ యాదగిరి చెప్పారు.ు గురువారం నిజామాబాదులో ఏర్పాటుచేసిన విలేకకరుల సమావేశంలో మాట్లాడుతూ..జులై 2న నిజామాబాదు నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. 2022-23 విద్యాసంవత్సరంలో పదవతరగతి, ఇంటర్ చదివిన పద్మశాలి విద్యార్థులు మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కులధృవీకరణ పత్రాల' జిరాక్స్ కాపీలతో ఈ నెల 25లోగా దరకాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పద్మశాలి సంఘం బాధ్యులు పుల్గం హన్మాండ్లు (93964 83999),గుజ్జేటి వెంకట్ నర్సయ్య, (99855 66374)రాపెల్లి గురుచరణ్(986655 7115)గుడ్ల భూమేశ్వర్ (94942 58585)కు దరఖాస్తులు అందజేయాలని ఆయన సూచించారు. సమావేశంలో నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు, నగర పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జేటి వెంకట్ నర్సయ్య, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి అధ్యక్షుడు రాపెల్లి గురుచరణ్, డైరెక్టర్ చింతల గంగాదాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని పిడిఎస్యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిజామబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, నగర అధ్యక్షులు ఎస్కే. అషుర్ లు మాట్లాడుతూ.. నిజామాబాద్ రూరల్ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయని, సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన సహకరించాలని కోరారు. ఒకటోవ డివిజన్ పరిధిలో గల కాలూరు ఉన్నత పాఠశాలలో భూమి కబ్జా అయిందని, బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తులు భూమిని కబ్జా చేసి, హైకోర్టులో కావాలనే కేసు వేశారని తెలిపారు. వెంటనే ప్రభుత్వ స్థలాన్ని కాపాడి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. నిజామాబాద్ రూరల్‌లో ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో భూమి కబ్జా అవుతుందని, సరిపడా సౌకర్యాలు లేవని బోధించడానికి ఉపాధ్యాయులు, లెక్చరర్స్ లేరని కొన్ని పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు కూడా లేక లేరని తెలిపారు. చాలాచోట్ల అద్దె వసతి గృహాలలో విద్యార్థులు అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నారని, వెంటనే శాశ్వత వసతి గృహాలను విద్యార్థుల సంఖ్య పరంగా నిర్మించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ మెస్ బాకాయిలను విడుదల చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ స్పందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల భూమి కబ్జాకు గురి కానివ్వమని, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్కాలర్షిప్స్, రియంబర్స్మెంట్, మెస్ బకాయిలు వెంటనే విడుదల అయ్యే విధంగా మాట్లాడుతారని తెలిపారు. కార్యక్రమంలో పిడిఎస్యు నిజామాబాద్ నగర నాయకులు సందీప్, పవన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం


నిత్యశ్రీని సన్మానిస్తున్న గ్రూప్‌సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

నీట్ పరీక్షలో ర్యాంకు సాధించిన చెన్న నిత్యశ్రీ ఫ్రెండ్లీ చిట్టి గ్రూప్ సభ్యులు సన్మానించి 15వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మ్యాక (త్రివేణి) గంగాధర్ మాట్లాడుతూ నిజా మాబాద్ జిల్లా నుండి పద్మశాలి ప్రతినిధి నిత్యశ్రీ నీట్ క్వాలిఫై కావడం చాలా గర్వకారణమని, 646 మార్కు సాధించినట్టు తెలిపారు. ఉన్నతమైన శిఖరాల అందుకోవాలని, మంచి స్పెషలైజేషన్ డాక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యదర్శి చెన్న రవికుమార్, ఇట్టెం జీవన్ , చిట్ల విజయ్ రావు,గొనె దామోదర్,చెలిమేల గంగాధర్,నూకల శ్రీనివాస్,నవనాథ్ సత్యనారాయణ, ప్రవీణ్ కోటగిరి, మ్యాక శ్రీకాంత్,శ్రీనివాస్ గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. నిత్యశ్రీ తండ్రి చెన్న శ్రీమాన్ గ్రూప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల గడువు మరో 20 రోజులు పెంచాలి

బీఎల్‌పీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బిసి వృత్తివారికి ప్రకటించిన ఆర్థికసాయం కోసం కులం సర్టిఫికెట్, ఇన్కమ్ సర్టిఫికెట్, త్వరితగతిన ఇవ్వాలని, ఆన్లైన్ గడువు మరో 20 రోజులు పెంచాలని బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండివెంకట్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లోగల బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల వృత్తుల కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని బిసి సంక్షేమ శాఖ ప్రకటించిందన్నారు. కానీ ఆన్లైన్ బిజీతో ఒక సమస్య ఉంటే మరోవైపు కులం సర్టిఫికెట్ ఇవ్వడానికి తసీల్దార్లు ఇబ్బందులు కలిగిస్తున్నారని విమర్శించారు. బీఎల్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లత, జిల్లా కన్వీనర్ మధు కాంబ్లే, నాయకులు శోభ, వామన్‌రావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ముప్కాల్


చెక్కు అందజేస్తున్న నాయకులు

మండలంలోని నాగంపేట్ గ్రామానికి చెందిన బద్దం గణేష్ కుటుంబానికి మంజూరైన ముఖ్య మంత్రి ఆర్థిక సహాయనిధి చెక్కును గురువారం బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జోషి ఉమ శంకర్, ఎంపీటీసీ సభ్యులు మోహన్ రెడ్డితో కలిసి అందజేశారు. నాగంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం గణేష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కావడంతో బాధిత కుటుంబసభ్యులు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జోషి ఉమ శంకర్, ఎంపీటీసీ సభ్యులు మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 45వేల నగదు, రెండు తులాల బంగారం, 12తులాల వెండి అపహరణ

నవతెలంగాణ-నందిపేట్


చిందరవందరగా పడేసిన చీరలు, వస్తువులు

మండలంలోని వెల్మల్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సి కాలనీలో తాళం వేసిన ఇంట్లో పథకం ప్రకారం తాళం కోసి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న సుమారు రూ.45 వేల నగదు, రెండు తులాల బంగారం, 12 తులాల వెండితో పాటు ఇల్లు పత్రాలను ఎత్తుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తమ బంధువుల పెళ్లి ఉండడంతో కుటుంబ సమేతంగా వెళ్లామని ఏవైనా ఊరి వారే దొంగలకు సహకరించడంతో పథకం ప్రకారం దొంగతనానికి పాల్పడి ఉంటారని బాధితులు కోమన్‌పల్లి జీవన్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం తొండాకూర్, డొంకేశ్వర్ దారులలో, నికాల్‌పూర్ ప్రధాన దారుల గుండా దొంగలు రాళ్లు అడ్డుపెట్టి అర్ధరాత్రి చోరీకి ప్రయత్నం చేసి బీభత్సం సృష్టించారు. ఉదయం గ్రామస్తులు వాటిని తొలగించేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితుడు తెలిపారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విత్తనాలు, ఎరువులు, టార్పలిన్లు రైతులకు అందుబాటులో ఉంచే విధంగా చూడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని నడ్పల్లి రైతు వేదికలో ఆగ్రో రైతు సేవ కేంద్రాల డీలర్లకు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో 21ఆగ్రో రైతు సేవా కేంద్రాలు ఉన్నట్లు వెల్లడించారు. పరిశ్రమల అభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేసి ఎరువులు. విత్తనాలు, తెలంగాణ సిరి ఎరువు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. డీలర్ రైతులకు అందుబాటులో ఉండి ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. ఈ సదస్సులో ఆగ్రోస్ రీజినల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, సూపర్వైజర్ అనసూయ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సల్మాన్, కార్య నిర్వహణ అధికారి రాజు, నిజామాబాద్ డివిజన్ ఏడిఏ ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు, ఏఈఓ భావన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-ఆర్మూర్


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీ సెంటర్లలోని సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పెర్కిట్ లో గల ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ భార్గవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి అధ్యక్షురాలు పి చంద్రకళ, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో రేషన్ డీలర్ నుండి బియ్యం తీసుకువచ్చిన హమాలీ డబ్బులు మూడు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్నాయని, సెంటర్‌కు వంట పాత్రలు చాలా రోజుల క్రితం ఇచ్చినవి పూర్తిగా పాడైపోయాయని, కొత్త వాటిని ఇప్పించాలని అన్నారు. కార్గో బస్సు ద్వారా వచ్చే ఫుడ్ సెంటర్‌కి రావడం లేదని, వేరే వాహనం ద్వారా ఫుడ్ సెంటర్‌కు చేరే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఏడు సంవత్సరాల నుండి టీఏ, డీఏ బిల్లుల బకాయిలు ఉన్నవి చెల్లించాలని, సెంటర్ కు కావలసిన రిజిస్టర్స్ అన్ని చార్జెస్ ఇప్పించాలని తెలిపారు. ఆరోగ్య లక్ష్మి ప్రారంభం అయినప్పటి నుండి ఇస్తున్న కూరగాయల బిల్లులు పాత బిల్లులు ఇస్తున్నారని పెరుగుతున్న ధరలకు అను గుణంగా పెంచాలని, బీఎల్ఓ డ్యూటీల నుండి టీచర్స్‌ని మినహాయిం చాలని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కోడి గుడ్ల నిల్వకోసం జాలీలతో కలిగిన బాక్సులు ఇవ్వాలని, ఇన్చార్జి సెంటర్ చేసే టీచర్స్‌కి అలవెన్స్ ఇవ్వాలని ,టీచర్లు అందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ సెక్టార్ లీడర్లు గోదావరి, జగదాంబ, లక్ష్మి ,అరుణ, పద్మ, కళావతి, కవిత, సునంద, లక్ష్మి, రోసి, వసంత తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఉత్తమ జీపీల సర్పంచులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


సర్పంచులను సన్మానించిన మంత్రులు, వర్కర్‌లు, వారితోపాటు జడ్పీచైర్మన్

జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికైన జీపీల సర్పంచులు జిల్లా పంచాయతీ అధికారిణి జయసుధ నేతృత్వంలో గురువారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. జిల్లా నుండి మొత్తం 27 మంది సర్పంచులు, ఇద్దరు మల్టీ పర్పస్ వర్కర్లు ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వీరిని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, హరీష్ రావుల చేతుల మీదుగా సన్మానించేందుకు హైదరాబాద్‌కు ఆహ్వానించారు. జిల్లానుండి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రాష్ట్ర మైనారిటీ చైర్మన్ తారిక్ అన్సారీ, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటీఎస్ శ్రీనివాస్ వెళ్లారు.

ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్ విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి అన్నారు. గురువారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ కాంపిటేషన్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుంకెట రవి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ కాంపిటేషన్ లో పాల్గొనదలచిన వారు ఈనెల 17న సాయంత్రం వరకు 18 నుండి 35 ఏండ్ల వయస్సు ఉన్న వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందుకు 7661899899 మొబైల్ నంబర్ కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆన్ లైన్ పరీక్ష ఉంటుందని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో పరీక్షలో మొదటి స్థానం సాధించిన మహిళకు ఒక ఎలక్ట్రికల్ స్కూటర్ బహుమతిగా ఇవ్వడం జరుగు తుందన్నారు. అదేవిధంగా మరో 43 మందికి ఇతరత్రా బహుమతులుగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో పలువురు యువకులతో రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ కాంపిటేషన్ లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి తక్కురి దేవేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

లారీ కిందపడి యువకుడి మృతి

- జన్నేపల్లిలో రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-నవీపేట్


సాయివంశీ మృతదేహం

మండలంలోని జన్నేపల్లి గ్రామంలో మోటార్ బైక్‌పై వెళ్తున్న కొండ సాయి వంశీ(21) లారీ కిందపడి గురువారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జన్నేపల్లి నుండి నిజామాబాద్ వైపు వెళ్తున్న ధాన్యం లారీ జన్నేపల్లిలోని ఎస్ఎస్ఆర్ పాఠశాల ముందు నుండి వెళ్తుండగా మోటార్ బైక్‌పై వెళ్తున్న పోతంగల్ గ్రామానికి చెందిన కొండ సాయి వంశీకి ప్రమాదవశాత్తు లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు ఎస్సై రాజారెడ్డి సంఘటన స్థలానికి వచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

డిగ్రీ పరీక్షల తేదీల్లో మార్పు

నవతెలంగాణ-డిచ్ పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ బ్యాక్లాగ్ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ మరియు 6వ సెమిస్టార్‌కు చెందిన జియోగ్రఫీ సబ్జెక్టు పరీక్ష ఈ నెల 20 జరగాల్సి ఉండగా 27కు, 2వ, 3వ, 4వ సెమిస్టంర్ జియోగ్రఫీ పరీక్ష లు ఈ నెల 21న జరగాల్సి ఉండగా 28కి, 5వ సెమిస్టర్ జియోగ్రఫీ పరీక్ష 23వ తేదిన జరగాల్సి ఉండగా జులై 8కి, 1వ సెమిస్టర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరీక్ష ఈ నెల 22న జరగాల్సి ఉండగా 24వ తేదికి,3వ,4వ సెమిస్టర్ మ్యాథమెటిక్స్ పరీక్ష ఈ నెల 26న ఉండగా 23కి మర్చామని పేర్కొన్నారు. 3వ సెమిస్టర్ కి చెందిన ప్రోగ్రామింగ్ విత్ సీ పరీక్ష 23న జరగాల్సి ఉండగా ఈ నెల 28 వ తేది న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్ సైట్‌శ్రీఱ సంప్రదించాలని సూచించారు.

దశాబ్ది ఉత్సవాలు ఎవరి ప్రయోజనాల కోసం ?

- ఏఐకెఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పీ.కారల్ మార్క్స్

నవతెలంగాణ-సిరికొండ


మాట్లాడుతున్న కారల్ మార్క్స్

ధాన్యం డబ్బులు చెల్లించలేదని, ఎప్పుడు చెల్లిస్తారో తెలియదని.ఇదంతా వదిలేసి బిఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏండ్ల పరిపాలనలో ఎవరికి ప్రయోజనం చేకూర్చారని ఈ దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నరని ఏఐకెఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కారల్ మార్క్స్ ప్రశ్నించారు. మండలం లోని గడ్కోల్ గ్రామం లో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ... దళితులకు 3 ఎకరాల భూమి పంపిణి చేస్తానని చెప్పి దళిత సమాజన్ని మోసం చేసారని, రైతులకు లక్ష లోపు రుణమాఫీ హామీ మరిచి రైతులను మోసం చేసారని, ఇంటికో ఉద్యోగం, ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి హామీ గాలికి వదిలేసారని అయన దుయ్యబట్టారు. పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చడానికి డబుల్ బెడురూమ్ ఇండ్లు ఏమయ్యాయని, అధికారంలోకి రాగానే వంద రోజుల్లో చెక్కెర ఫ్యాక్టరీలు తెరిపించి నడిపిస్తానని చెప్పిన మాటకు 9 ఏండ్లు పూర్తి అయినా నెరవేరలేదని, చెరుకు రైతు బతుకులో చేదును మిగిల్చి, కార్మికులను రోడ్డున పడేసిన చరిత్ర కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణలోనే సహకార రంగంలో కొనసాగిన ఏకైక చక్కెర ఫ్యాక్టరీ సారంగాపూర్ ఎంసీఎఫ్‌ను తెరిపించి నడిపించాలని, లేదా 95 యాక్టులో రైతులకే అప్పాజెప్పాలని అయన డిమాండ్ చేశారు. మిగులు బడ్జెట్ తెలంగాణను, అప్పుల తెలంగాణగా మార్చి, బంగారు తెలంగాణగా అంటూ కేసీఆర్ కళ్ళబొల్లి మాటలతో కాలం గడుపుతున్నారని అన్నారు. ప్రజా ధనాన్ని దశాబ్ది ఉత్సవాల పేరిట ఖర్చు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ మండల అధ్యక్షులు నిమ్మల భూమేష్, ప్రధాన కార్యదర్శి పి. ఎల్లయ్య, గులాం హుస్సేన్, నాయకులు జి కృష్ణ, రాములు గంగారెడ్డి, శివరాజ్, సంజీవ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కు అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ఆశగా నిలుస్తుందని డోంగ్లి మండలంలోని పెద్దటాక్లి సర్పంచ్ రాజాబాయి విలాస్ తెలిపారు. గురువారం లబ్ధిదారునికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును ఆమె అందజేశారు. లబ్ధిదారుడు అఫ్సర్‌సాబ్‌కు అందజేసిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదవ్‌రావు పటేల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అహేమద్ హుస్సేన్, సామాజిక కార్యకర్త సాయిలు, గోరంచే, వార్డ్‌మెంబర్ షాదులసాబ్, వీవోఏ మాధవ్, కారోబార్ ఆమజాద్ పటేల్, విక్రమ్, అఫ్సర్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

సాలంపాడ్ గ్రామంలో బోనాలు



నవతెలంగాణ-బోధన్

పల్లె ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సాలూర మండలం సాలంపాడ్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బుద్దె సావిత్రి మహిళలతో బోనాలు ఎత్తుకుని గ్రామ దేవతల వద్దకు చేరుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో పల్లె ప్రగతి ప్రగతి వివరాలను వివరించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడపల్లి పద్మ, నర్సారెడ్డి ముఖ్య నేత బుద్దె రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి హరిత గ్రామస్థులు పాల్గొన్నారు.

క్విజ్ కాంపిటేషన్ కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్ కరపత్రాలను మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి బోధన్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ఇన్స్పిరేషన్‌తో జూన్ 18న యువతలోని నైపుణ్యాన్ని వెలికి తీయడానికి రాజీవ్‌గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గంలోని ప్రతి యువత పార్టీలకతీతంగా కులమతాలకతీతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే జూన్ 18వ తేదీన ప్రతి ఒక్కరూ క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొని బహుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దొడ్ల రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు పాషా, ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్ గౌడ్, బోధన్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, పార్టీ బోధన్ పట్టణ ఉపాధ్యక్షులు హరికాంత్ చారి, సొసైటీ చైర్మన్ మందన్న రవి, బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ పోరాటం వల్లే వికలాంగులకు పెన్షన్ పెంపు

- మద్నూర్‌లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మందకృష్ణ మాదిగ పోరాటం వల్లే వికలాంగులకు ప్రభుత్వం పెన్షన్ పెంచిందని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు కర్రేవార్ బాలు యాదవ్ తెలిపారు. మద్నూర్ మండల కేంద్రంలో గురువారం ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం అనే నినాదంతో భారతదేశంలో ఎవరికి ఆపద వచ్చినా వాళ్ల తరపునుంచి పోరాటం చేసేది మందకృష్ణ మాదిగనే అన్నారు. ఆనాడు వికలాంగులకు రూ.200 పెన్షన్ ఉన్నప్పుడు వికలాంగుల కష్టాలు బాధలు ఎవరూ పట్టించుకోని స్థితిలో వాళ్లకు సరైన గౌరవం దక్కని సమయంలో మందకృష్ణ మాదిగ వికలాంగుల కోసం వాళ్ళ తరపునుంచి పోరాటం చేసి వాళ్లకు రూ.3016 పెంచాలనే డిమాండ్ ప్రభుత్వంపై పోరాటం వల్లనే రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు రూ.3016 పెన్షన్ అమలు పరిచిందని కొనియాడారు. కార్యక్రమంలో వికలాంగులు లక్ష్మణ్, ద్యపుర్వర్ రమేష్, పాకల్ సాయిలు, ఎమ్మార్పీఎస్ నాయకులు కోలావర్ పండరీ, క్రరైవార్ మారుతి, గడ్డం వారి యాదరావు, హాల్దే రాజేందర్, క్రరేవార్ లాలూ, క్రరేవార్ చందు, గడ్డంవార్ సంతోష్, క్రరేవార్ తుకారాం, క్రరేవార్ రామ్ కాంబ్లే, సంతోష్, గొంటేవార్ నగేష్, గడ్డంవార్ బాలాజీ, గడ్డంవార్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తాం

- ఏడీఏ రత్నం



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ రత్నం

నవతెలంగాణ-లింగంపేట్

ఎరువులు విత్తనాల దుకాణంలో నకిలీ విత్తనాలు, నకిలీ మందులు విక్రయిస్తే వారి లైసెన్సులు రద్దు చేస్తామని ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జై యోగేశ్వర జగదాంబ శ్రీ ఆంజనేయతో పాటు పలు ఫెస్టిసైడ్ దుకాణాల్లో ఆమె తనిఖీలు చేశారు. ఏ రకాల ఏ కంపెనీలకు చెందిన విత్తనాలు విక్రయిస్తున్నారో దుకాణ యజమానులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంపెనీలకు చెందిన విత్తనాలకు సంబంధించి బిల్లులను ఆమె పరిశీలించారు. అదేవిధంగా క్రిమిసంహారక మందులు ఏవి విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. గడువు ముగిసిన మందులు విక్రయించవద్దని తెలిపారు. రైతులకు నాణ్యమైన కంపెనీల ప్రభుత్వం సూచించిన విత్తనాలు విక్రయించాలన్నారు. రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని సూచించారు. ఏ విత్తనాలు అందుబాటులో ఉన్నాయో ఎంత నిల్వ ఉందో అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు ధరల పట్టికను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదవుతాయని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట ఏవో అనిల్ కుమార్ తదితరులున్నారు.

యాదవ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి గ్రామంలో కృష్ణ యాదవ సంఘం భవన నిర్మాణానికి సర్పంచ్ పద్మ గంగారెడ్డి చేతుల మీదుగా గురువారం భూమి పూజ చేసినట్టు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అట్టెం శీను తెలిపారు. గ్రామంలో యాదవులకు సంఘం భవన నిర్మాణం లేకపోవడంతో ప్రతినెల సమావేశం ఇండ్లల్లో నిర్వహించుకోవాల్సి వస్తుందన్నారు. యాదవులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ దగ్గరికి వెళ్లి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని యాదవుల కోరగా సానుకూలంగా స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గురువారం ఉదయం నూతన భవన నిర్మాణానికి టెంకాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రూప్సింగ్, బిఆర్ఎస్ మండల నాయకుడు నాయకోటి సత్యనారాయణ, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అట్టెం శీను, హప్ప సాయిలు యాదవుల తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతితో గ్రామాల అభివృద్ధి

- వెల్లడించిన సర్పంచ్‌లు
- ఘనంగా పల్లెప్రగతి దినోత్సవం
- జాతీయ జెండాలు ఎగురవేత

నవతెలంగాణ-విలేకరుల బృందం

పల్లెప్రగతితో గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని పలువురు సర్పంచులు అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లెప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి ప్రగతిపై మాట్లాడారు.



మద్నూర్ : జెండావిష్కరణలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



తాడ్వాయి : నందివాడలో..

జుక్కల్ : మండలంలోని 30 గ్రామపంచాయతీలలో పండుగల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. మన రాష్ట్రంలో అత్యధిక శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని వివరించారు.

పల్లె ప్రగతి దినోత్సవం..

మద్నూర్ : మద్నూర్, డొంగ్లి మండలాల పరిధిలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లె ప్రగతి ఉత్సవాలు ఆయా గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు వివిధ శాఖల అధికారులు గ్రామాల ప్రజలు కలిసి జాతీయ జెండాలు ఎగురవేసి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన డొంగ్లి మండలంలోని సిర్పూర్ సర్పంచ్ కవిత శంకర్ పటేల్ జాతీయ జెండా ఎగురవేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లెప్రగతి పథకాల ద్వారా గ్రామ పల్లెలు ఎంతో అభివృద్ధికి నోచుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ గ్రామంలోని ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో అధికారికంగా ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ పాండేరావు, గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కే శ్రీనివాస్, పశువైద్యశాల వద్ద ఇంచార్జి వైద్యులు సందీప్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాలను ఆవిష్కరించి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పల్లె ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రంతో పాటు దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని వక్తలు అన్నారు. ఎడపల్లి ప్రాథమిక సహకార సంఘం వద్ద సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మంగళ్‌పాడ్, కుర్నాపల్లి, బాపునగర్, జానకంపేట్, ఎంఎస్సీ ఫారం, వడ్డేపల్లి, తానాకలాన్ తదితర గ్రామాలలో సర్పంచులు మెగావత్ సునీత రవి బట్టు హనుమాన్లు, సావిత్రి రవీందర్‌గౌడ్, సాయిలు, భాస్కర్‌రెడ్డి, పంచాయతీ పాలకవర్గం కార్యదర్శులు జాతీయ జెండాను ఎగురవేశారు.

చందూర్ లో ఘనంగా పల్లెప్రగతి

వర్ని : చందూర్ మండల కేంద్రంలో పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా ప్రజా ప్రతినిధులతో పాటు కలిసి సర్పంచ్ శ్రీ కర్లం సాయరెడ్డి, లక్ష్మపూర్‌లో సత్యనారాయణ, మోస్రాలో సుమలత రాంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలలో డీజే సౌండ్‌లతో ఊరంతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో మంజూరు అయిన నిధులను, గ్రామ పంచాయతీ ద్వారా జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను గ్రామసభలో ప్రజలకు తెలిపారు. గ్రామ ప్రజల తరపున స్పీకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిలు, పంచాయతీ పాలకవర్గ సిబ్బంది, వార్డు సభ్యులు సతీష్‌రెడ్డి, లస్కరి సాయమ్మ, వడ్ల గౌరాబాయి, దేవరి అంశవ్వ, గ్రామపెద్దలు శేషుగారి రాంరెడ్డి, లైన్‌మెన్ శ్రీధర్‌రెడ్డి, మాదరపు రాంరెడ్డి, కల్లూరి రాంరెడ్డి, అర్కల నర్సారెడ్డి, జయరాం, చాకలి బాబు, మైనారిటీ సోదరులు బ్యాంక్ హైమద్, వెన్న లక్ష్మణ్ భూమేష్, శ్రీనివాస్, రాజేశ్వర్, అరిగెల సాయిలు, ఎడ్ల ప్రవీణ్, బొట్టే శంకర్, పెంట సాయిలు, దాకడి సాయిలు, డ్వాక్రా మహిళలు, ఐకేపీ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుర్నాపల్లిలో పల్లె ప్రగతి..

ఎడపల్లి : మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో గల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పాల్గొని పల్లె ప్రగతి కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పల్లె ప్రాంతాలు పచ్చదనంగా ఉన్నప్పుడే పకృతి అభివృద్ధి సాధ్యమవుతుందని డాక్టర్ రాజకుమార్ అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ సావిత్రి రవీందర్ గౌడ్, ఎడపల్లి ఇంచార్జ్ వైద్య అధికారి రాజకుమార్, పంచాయతీ కార్యదర్శి హరీష్‌రెడ్డి, ఏఎన్ఎం శాంత, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరు మండలంలో ఘనంగా పల్లె ప్రగతి దినోత్సవం..

బోధన్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండలంలోని ఆయా గ్రామాలలో పల్లె ప్రగతి దినోత్సవాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పల్లె ప్రగతిలో చేపట్టిన పనులను గ్రామ సభలో వివరించారు. అనంతరం మామిడి తోరణాలతో ముగ్గులతో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా ప్రజలకు నిరంతరం సేవ చేస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించి, వారికి కాస్మెటిక్ వస్తువులను, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో సాలూరు మండల తహసీల్దార్ పడాల మమత, ఎంపీపీ బుద్దే సావిత్రి, మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దే రాజేశ్వర్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ సవిత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వద్ద జెండాను ఆవిష్కరించారు. గ్రామపంచాయతీ కార్మికులకు సన్మానం, పల్లె పకృతి వనాల సుందరీకరణ, ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని మోతే, మంబోజిపేట్, శెట్పల్లి సంగారెడ్డి, జల్లిపల్లి, భవానీపేట్, నల్లమడుగు, బాణాపూర్, బాయంపల్లి, లింగంపల్లి, సురాయపల్లి, కోమటిపల్లి, పోల్కంపేట్, శెట్టిపల్లి సంగారెడ్డి, పరమళ్ళ, శెట్టిపల్లితో పాటు ఆయా గ్రామపంచాయతీలో పల్లె ప్రగతి దినోత్సవ సందర్భంగా ఉదయం ఇండ్ల వద్ద ముగ్గులు వేశారు. అలాగే లింగంపేట్ మండల కేంద్రంలో జెండా ఎగురవేశారు. పల్లెప్రగతి ద్వారా, గ్రామానికి వచ్చిన నిధుల వివరాలను, వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు జరిగిన లబ్దిని, గ్రామంలో నిర్మించిన మౌలిక వసతుల వివరాలను పంచాయతీ కార్యదర్శి వివరించడంతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం మెరుగుపడిన తీరును ప్రజలకు వివరించాలని జిల్లాస్థాయిలో సాధించిన అవార్డుల వివరాలను గుర్తుచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు గ్రామంలో వేడుకలగా గ్రామపంచాయతీలను ముస్తాబు చేసి, అందంగా తీర్చిదిద్దారు. నాడు-నేడు గ్రామాల్లో సౌకర్యాలు ఓడీఎఫ్ ప్లస్, ఆసరా పింఛనులు, గ్రామ పంచాయితీ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ప్రగతి నివేదికలు తెలిపేలా ప్రత్యేక బ్యానర్లను ఏర్పాటు చేసి గ్రామంలో ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయం వద్ద జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సఫాయి కార్మికులను పంచాయతీ పాలకవర్గం, ఎంపీడీఓ, ఎంపీఓ చేతుల మీదుగా సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ కౌడ రవి, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీఓ ప్రభాకర్ చారి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, వార్డ్ మెంబర్లు రమేష్, నరేష్, రమేష్, మంగలి రాజు, బీఆర్ఎస్ కార్యకర్తలు నయీమ్, ముదాం సాయిలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, హెల్త్‌వర్కర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండలంలోని దేమికలాన్, నందివాడ గ్రామంతో పాటు పలు గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లె ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి తెలంగాణ వచ్చిన తర్వాత గ్రామంలో జరిగిన అభివృద్ధి గురించి, గ్రామానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ సంక్షేమ పథకాలకు వస్తున్న నిధులను గురించి చర్చించారు. గ్రామానికి ఉత్తమ సేవలు అందించినందుకు సిబ్బందిని సన్మానించారు. నూతన గ్రామ పంచాయతీ బిల్డింగ్ మంజూరు చేసినందుకు సురేందర్‌కు, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో సర్పంచ్లు, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, అభివృద్ధి అధికారి రాజ్‌వీర్, గ్రామ పాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లె ప్రగతిని ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో జాతీయ జెండాను సర్పంచ్‌లు ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందికి పాలకవర్గం బూట్లు, హెల్మెట్, అఫ్రాన్ నూతన దుస్తులు అందించారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. ఆశ, అంగన్వాడీ కార్యకర్తలకు సన్మానించారు. గ్రామాల్లోని వైకుం ఠదామం, డంపి ంగ్‌యా ర్డును సందర్శించారు. అనంతరం ప్రకృతి వనంలో అల్పాహారం స్వీకరించారు. సర్పంచ్‌లు స్వప్న, నర్సయ్య, రాజమణి, ఉపసర్పంచ్ స్వప్న, నర్సయ్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో..



బిచ్కుందలో..



ఎడపల్లిలో..



బోధన్‌లో..

బిచ్కుంద : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల ప్రజలందరూ గ్రామపంచాయతీ ఆవరణలో చేరుకొని పల్లె ప్రగతి కార్యక్రమంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వద్దకు ఊరేగింపుగా వెళ్లి పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్‌లకు పూజలు నిర్వహించి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బిచ్కుంద సర్పంచ్ శ్రీరేఖరాజు, ఫథలాపూర్ సర్పంచ్ అరుణ్ కుమార్, పెద్దదేవాడ సర్పంచ్ శివా నందప్పా, వాజీద్‌నగర్ సర్పంచ్ తోట అనుయ లక్ష్మీనారాయణ జాతీయ జెండా ఎగురవేశారు. వాజిద్‌నగర్ గ్రామంలో సర్పంచ్ తోట అనూయ లక్ష్మీనారాయణ మల్టీపర్పస్ కార్మికులకు అంగన్వాడీ, ఆశ, వీఆర్ఏలకు ఆరోగ్య సిబ్బందికి శాలువాతో సన్మానించారు. సర్పంచ్ తోట అనుయ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన గ్రామ అభివృద్ధి పనులకు సహకరించిన గ్రామ ప్రజలకు మండల స్థాయి అధికారులకు ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్, మండల పంచాయతీ అధికారి మహబూబ్, ఎంపీటీసీ బండకింది సాయిలు, ఉప సర్పంచ్ బద్రి సాయిలు, అధికారులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-జుక్కల్



పల్లెప్రగతి దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని లొంగన్ సర్పంచ్ నాగలగిద్దే ఉషారాణి సదుపటేల్ అధ్యక్షతన పల్లె ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో విండో చైర్మెన్ శివానంద్, మాజీ మార్కెట్ చైర్మెన్ సాయాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాదారావ్ దేశాయి, మాజీ అధ్యక్షుడు నీలు పటేల్, శివాజీ పటేల్, సదుపటేల్, సర్పంచులు రవిపటేల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ

మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో స్థానిక ఎంపీపీ నా రెడ్డి దశరథ్‌రెడ్డి, సర్పంచ్ దండబోయిన సంజీవ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులచే, నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ యోసేఫ్, వైస్ ఎంపీపీ రవీందర్రావు, రైతుబంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ ప్రసాద్, నాయకులు రంగు రవీందర్‌గౌడ్, కాసర్ల రాజేందర్, జంగం లింగం, కందూరి లింబాద్రి, బండి ప్రవీణ్, దోమకొండ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫార్మాసిస్ట్ అవార్డు అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవం రోజున బెస్ట్ ఫార్మసిస్ట్ అవార్డును జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి చేతుల మీదుగా ఏరియా ఫార్మాసిస్టు సురేష్ అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం సూపరింటెండెంట్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్, ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ నాగరాజు, వైద్యులు డాక్టర్ అమృత్ రామ్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు .

20 లోపు దరఖాస్తులు అందజేయాలి

ఎంపీడీవో

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన కులవృత్తి, చేతివృత్తి దారులకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సాయం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురువారం మండల అభివృద్ధి అధికారి దామోదర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20లోపు టీఎస్ వోబీఎంఎంఎస్ బీసీ.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్సైట్ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తి చేసిన తర్వాత దరఖాస్తులను మండల పరిషత్తు కార్యాలయంలో అందజేయాలని సూచించారు..

కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- తెలంగాణ పల్లె ప్రగతి కార్యక్రమంలో సర్పంచులు
- గ్రామాల్లో జాతీయ జెండాల ఆవిష్కరణ
- ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్రంలో కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని సర్పంచ్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సభల్లో 2014 నుండి 2023 వరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శులు చదివి వినిపించారు. వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు సంక్షేమ పథకాలు, పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్, మిషన్ భగీరథ, తెలంగాణ క్రీడ ప్రాంగణం, హరితహారం, పారిశుద్ధ కార్యక్రమాలు, సిసి రోడ్లు, మట్టి రోడ్ల నిర్మాణం, తదితర వివరాలతో కూడిన గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన పల్లె ప్రగతి బ్రోచర్ చదివి విడుదల చేశారు. ఉత్తమ పారిశుద్ధ కార్మికులకు ప్రశంస పత్రాలు అందజేసి, శాలువలతో సత్కరించారు. గ్రామంలో చేసిన పలు అభివృద్ధి పనుల ఫోటోలను ప్రదర్శించారు. అనంతరం పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో గల పల్లె ప్రకృతి వనం, నర్సరీ లను ర్యాలీగా వెళ్లి సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సీఏలు, మేట్లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఇంత వరకు జరిగిన అభివృద్ధిని గ్రామ ప్రజలకు సర్పంచులు వివరించారు. ఇంకా ఎలాంటి అభివృద్ధిని గ్రామాల్లో చేసుకుందామని గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

భీంగల్: మండంలంలోని బాబాపూర్ గ్రామంలో సర్పంచ్ ఆయేషాఫిర్దోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లెప్రగతిలో ప్రత్యేకాధికారి, ఏపియం కుంట శ్రీనివాస్ హజరయ్యారు. అనంతరం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు 286 మందికి మాత్రమే పెన్షన్లు వచ్చేవని, కానీ ఇప్పుడు 565 మందికి అందజేస్తుందని తెలిపారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..



డిచ్‌పల్లి: మెంట్రాజ్‌పల్లిలో సిబ్బందికి సన్మానం

ముప్కాల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో పల్లె ప్రగతి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. సర్పంచులు, పంచాయతీ కార్యాలయ సిబ్బందిని, పారిశుధ్య కార్మికులను, ఆశా వర్కర్లను, అంగన్ వాడి సిబ్బందిని, ఐకేపీ వివోఏలను శాలువాలతో సత్కరించారు. ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు కొమ్ముల శ్రీనివాస్, జక్క మల్లు బాయి, ఆకుల రాజారెడ్డి, మారెల్లి విష్ణు, మట్ట సందీప్, కాశిరెడ్డి రాజవ్వ, ఉప సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డ్ సభ్యులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు..

డిచ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 15-న పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా డిచ్ పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి, గంగారాం తండా గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు డిప్‌చంద్, రాజ్ కాంత్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అన్ని గ్రామ పంచాయతీలలో సిబ్బందిని సన్మానించి, వారు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రలను అందజేశారు. గ్రామ పంచాయతీలలో జమ ఖర్చులను ప్రజలకు వివరించి, గ్రామంలో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు లోలం సత్యనారాయణ, సుమిత్ర చందర్, తెలు విజయ్ కుమార్, పాపాయి తిరుపతి, మమతా శేఖర్, పానుగంటి రూపా సతీష్ రెడ్డి, లలితా దాస్, పత్తి మమతా ఆనంద్, ఖాతిజా యూసఫ్, నడ్పన్న, పాశం సత్తేవ్వ నర్సింలు, ఉప సర్పంచులు రఘునథన్ రాము, యెంకనోల్ల రమేష్, కార్యదర్శులు, గ్రామఅభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్:

పల్లె ప్రగతిలో భాగంగా గాంధీనగర్‌లో గ్రామపంచాయతీ నూతన భవనం నిర్మాణంకోసం భూమి పూజ చేశారు. గ్రామపంచాయతీలో జాతీయ జెండాను కూడా ఎగురవేశారు కార్యక్రమంలో గాంధీనగర్ సర్పంచ్ అనూష లక్ష్మణ్ నాయక్, మండల అధ్యక్షుడు మీసాల మధుకర్ రావు, ఎంపీపీ అనుష ప్రేమ్ నాయక్ జెడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, ఎంపిడిఓ మల్లేశం పాల్గొన్నారు

తిరుమన్‌పల్లిలో పల్లె ప్రగతిలో భాగంగా జాతీయ జెండా ఎగురవేయడం, మానవ హారం, తదితర కార్యక్రమాలను చేశామని సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు

కేశాపూర్‌లో పల్లె ప్రగతి లో భాగంగా పలు కార్యక్రమాలను చేపట్టారు. జాతీయ జెండా ఎగురవేశారు. మానవ హారం చేశావని సర్పంచ్ వనిత తెలిపారు

మోపాల్: మోపాల్ మండల కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. మొదటగా జాతీయ జెండా ఆవిష్కరించారు. సఫాయి అన్నకు సలామని సర్పంచ్ క్యాతం రవి, ఉపసర్పంచ్ రవికుమార్ వారి సేవలను కొనియాడారు, సఫాయి సోదరులకు సన్మానం చేసి సబ్బులు, నూనె, బూట్లు, టవల్స్ ,పేస్టులు పంపిణీ చేశారు. కార్యదర్శి మధుసూదన్ రెడ్డి తడి చెత్తను పొడి చెత్తను వేరు చేయడం వల్ల దాని వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. గ్రామపంచాయతీలో తయారు చేసిన పొడి చెత్త ఎరువును గ్రామ రైతులకు అందజేశారు.కార్యక్రమంలో. ఏపీఎం మోహన్ , కస్తూరిబా గాంధీ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామంలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరించి గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రామ సభ నిర్వహించి 2014కు ముందు 2014 తర్వాత గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులును సర్పంచు ఫోరం మండల అధ్యక్షుడు, సర్పంచ్ ఇందూరు సిద్ధార్థ ప్రజలకు వివరించారు. డంప్ యార్డ్ నిర్మాణం కానీ స్మశానవాటిక, సిసి రోడ్డు నిర్మాణాలు, డ్రైనేజీ వ్యవస్థ, తదితర అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలిపారు. గ్రామ సెక్రెటరీని వార్డ్ మెంబర్లని అంగన్వాడి టీచర్లని ఆశ వర్కర్ల అన్ని డ్వాక్రా మహిళలని స్కూల్ టీచర్లు, గ్రామంలో ఉత్తమ సేవలు అందించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగదీష్, కోఆప్షన్ మెంబర్ అజీమ్. ఎంపీటీసీ నిర్మల, వార్డు సభ్యులు సాయిరెడ్డి మైసన్న, లత, ప్రవీణ్ ,విడిసి సభ్యులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: తిర్మన్‌పల్లిలో జెండా ఆవిష్కరణ



మాక్లూర్‌లో..



నిజామాబాద్ రూరల్ మండలంలో..

కేజీవీల్ ట్రాక్టర్లను రోడ్ల పై నడిపితే చర్యలు తప్పవు

- ఎస్ఐ

నవతెలంగాణ - వేల్పూర్

కేజీవీల్ ట్రాక్టర్లను రోడ్ల పై నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ గురువారం తెలిపారు. రోడ్ల పైన కేజీవీల్ ట్రాక్టర్‌ను డైరెక్ట్‌గా నడపడంవల్ల ఎన్నో సంవత్సరాలు నాణ్యతగా ఉండాల్సిన రోడ్లు కొన్ని సంవత్సరాలకే పాడవుతున్నాయని అన్నారు. దీనివల్ల ప్రజాధనం వృధా అవుతుందని, రోడ్లు పాడవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కేజీవీల్ ట్రాక్టర్లను డైరెక్ట్‌గా రోడ్లపై తిప్పొద్దని, దానికి పట్టీ (సేఫ్టీ రింగు) కానీ లేదా ట్రాలీపై పెట్టి కానీ తరలించాలని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా కేజీవీల్ ట్రాక్టర్లను డైరెక్ట్‌గా రోడ్లపై నడిపితే ట్రాక్టర్‌ను సీజ్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఎవరికైనా ఎక్కడైనా రోడ్ల మీద కేజీవీల్ నడిపినట్టు కనిపిస్తే తమకు వెంటనే కింద ఇచ్చిన నెంబర్లకు కాల్‌చేసి చెప్పాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఆర్మూర్ రూరల్ సర్కిల్ 8712659859. సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, వేల్పూర్ పోలీస్ స్టేషన్ 8712659862 నెంబర్లకు తెలపాలని పేర్కొన్నారు.

సెల్‌ఫోన్లు రికవరీ



సెల్‌ఫోన్లు అందజేసిన పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 ఫోన్లను రికవరీ చేసినట్లు నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ గురువారం తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల ఆచూకీ కనుగొనేందుకు ఏర్పాటు చేసిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అద్భుత ఫలితాలను ఇస్తోందని, పోలీస్‌శాఖ ద్వారా నిరంతరం ప్రత్యేకంగా దీనికోసం పనిచేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌లను ఏర్పాటు చేశామని, ఫలితాలు కూడా అలాగే వస్తున్నాయని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 ఫోన్లను రికవరీ చేయగా అందులో ఒక ఐఫోన్ ఉండగా కేవలం ఒక ఫోన్ విలువే లక్ష రూపాయలు ఉండగా మిగతా తొమ్మిది ఫోన్ల విలువ రెండు లక్షలు ఉందని తెలిపారు. ఈ పోర్టల్ సిస్టం ప్రారంభమైనప్పటి నుండి సుమారు ఒకటో పోలీస్ స్టేషన్ పరిధిలోని 50 వరకు సెల్‌ఫోన్లను రికవరీచేసి పోగొట్టుకున్న వారికి అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలోనే అందజేయడం జరిగిందని వివరించారు. ఈ పోర్టల్ ద్వారా పనిచేస్తూ ఫోన్లను రికవరీ చేసిన ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ విజయ్ బాబు తోపాటు ఒకటవ పోలీస్ స్టేషన్ పోలీసుల బృందాన్ని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ అభినందించారు. ప్రజల సైతం సెల్ ఫోన్లు విషయంలో జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు

ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపా కల్, దోంచ ంద, నాగేంద్ర నగర్ గ్రామా ల్లో జడ్పీటీసీకి వచ్చిన లక్ష 25 వేల రూపాయల నిధులతో సర్పంచులు ప్రధాన కూడళ్ళలో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయించడంతో గ్రామాల్లోని కూడళ్ళు కొత్త కళ సంతరించుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం,కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, సర్పంచులు పత్తిరెడ్డి ప్రకాష్, గద్దె రాధ గంగారాం, మంజుల బాలాజీ గౌడ్, ఉపసర్పంచులు సోమిరెడ్డి శ్రీనివాస్, లోలం అశోక్, కుర్మ శేఖర్, తదితరులు పాల్గొన్నారు..



ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసిన సర్పంచులు

గుండె ఆపరేషన్ కోసం రూ. 3లక్షల ఎల్‌ఓసి అందజేత

- బాధితులకు అండగా నిలుస్తున్న మంత్రి వేముల



ఎల్ఓసీ అందజేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

అనారోగ్యం బారినపడి వైద్య ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత లేని బాధితులకు రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అండగా నిలుస్తున్నారు. సీఎం సహాయనిధి నుండి కోట్ల రూపాయలు ఇప్పించి బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన సిహెచ్. వరలక్ష్మి గుండె సంబంధిత అనారోగ్యంతో బాధ పడుతుంది. ఈ విషయం ప్రజాప్రతినిధుల ద్వారా మంత్రి దృష్టికి తీసుకురాగా హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో గుండె ఆపరేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.3లక్షల ఎల్ఓసి మంజూరు చేయించారు. గురువారం హైదరాబాద్‌లో రూ. 3లక్షల ఎల్ఓసి కాపీని బాధిత మహిళ భర్త సిహెచ్. గంగాధర్‌కు మంత్రి ప్రశాంత్ రెడ్డి అందజేశారు. ప్రశాంత్ రెడ్డి మేలు మర్చి పోలేమని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

కష్టంతో కాదు.. ఇష్టంతో చదవాలి

- జిల్లా విద్యాదికారి దుర్గప్రసాద్

నవతెలంగాణ-భీంగల్

విద్యార్థులు కష్టంతో కాకుండ ఇష్టంతో చదివినపుడే తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని జిల్లా విద్యాదికారి దుర్గప్రసాద్ అన్నారు. పురాణీపేట్ గ్రామంలో పద్మగంగా వీరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవతరగతి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను వారి తల్లిండ్రులను గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి ముఖ్య అతితిగా హజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ముందుగానే నిర్దేశించుకొని ఆ దిశగా కష్టపడి చదివినపుడే జీవితంలో ఉన్నతస్థానంలో నిలుస్తారని,వారికి సమాజంలో మంచి గుర్తింపు లబిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శంకర్, యంపిటీసి సాయి ప్రసన్న, పద్మజగదీశ్వర్, యంఈఓ స్వామి, డాక్టర్ బసంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న డీఈవో

కొత్త మెనూ పేరుతో వేధిస్తే ఉద్యమం తప్పదు

నవతెలంగాణ-మోపాల్

కొత్త మెనూ పేరుతో మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తే ఉద్యమం తప్పదని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగంగాధర్ తెలిపారు. గురువారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మండలంలోని నర్సింగ్ పల్లి, ముదక్‌పల్లి, కులాస్‌పూర్, డిచ్‌పల్లి కేంద్రాలలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై అధ్యయనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిలను చెల్లించకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా కొత్త మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందిస్తామని ప్రకటించిందని, అందుకు అనుగుణంగా స్లాబ్ రేట్లు నిర్ణయించకుండా దానిని అమలు చేయాలని హెడ్మాస్టర్లు మధ్యాహ్న భోజన కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. నర్సింగ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో కొత్త మెనూ ప్రకారం వంట చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించి పెరిగిన ధరలకు అనుగుణంగా స్లాబ్ రేటుని పెంచే వరకు, పెండింగ్‌లో ఉన్న ఏడు కోట్ల బకాయిలను విడుదల చేసే వరకు పాత పద్ధతుల్లోనే వంట నిర్వహిస్తామని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అన్నారు.



పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులు, పెన్షనర్ల, వారి సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణినీ అవలంభిస్తోందని, గత తొమ్మిది సంవత్సరాలుగా పెన్షనర్ల, ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలతో ఒక్క సమావేశమైన జరపని ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ అని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు ఆరోపించారు. గురువారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో జరిగిన పెన్షనర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ

కాల పరిమితి ముగిసినా పీఆర్సీ కమిటీని ఇంతవరకు వేయలేదని, బకాయి పడ్డ డీఏలు మంజూరు కాలేదని, నగదు రహిత వైద్యం గురించి గతంలో చెప్పిన మాటలు అమలుకు నోచుకోవటం లేదని అన్నారు. మెడికల్ రీయంబర్స్మెంట్ నెల లోపల బిల్లు చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దానిని అమలు చేయడం లేదని ఆయన అన్నారు. ప్రధాన కార్యదర్శి ఎస్ మదన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షలకుపైగా పెన్షనర్లు ఉన్నారని, 30 నుండి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వానికి, ప్రజలకు సేవలు అందించిన వీరి పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని, వయోభారంతో చేయూతనియకపోతే అదొక సామాజిక సమస్యగా మారిపోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. జిల్లా కోశాధికారి ఈవీఎల్ నారాయణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ఉద్యోగుల, పెన్షనర్ల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని, పెన్షన్‌పై దాడికి ఉపక్రమిస్తున్నాయని, పెన్షన్‌లో సంస్కరణలు తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు జార్జ్, భోజరావు, శిర్ప హనుమాన్లు , అందే సాయిలు, ఫ్లొరెన్స్, ప్రసాద్ రావు, లావు వీరయ్య, తదితరులు మాట్లాడారు.

నెలరోజుల సమస్య నిమిషాల్లో పరిష్కారం

- ఎమ్మెల్యే చొరవతో తీరిన సమస్య
- ధన్యవాదాలు తెలుపుతున్న రైతులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వ్యవసాయ పంట పొలాలకు వచ్చే విద్యుత్ స్తంభాలు విరిగిపోయి రైతులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు మొర పెట్టుకున్నా సమస్య మాత్రం తీరలేదు. గత్యంతరం లేక రైతులు ఆందోళనకు సిద్ధం అవుతున్న తరుణంలో గురువారం ధర్పల్లి మండల కేంద్రానికి ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రహదారి వెంట వెళ్ళడం గమనించిన రైతులు రోడ్డు పక్కన నిలబడి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కారుకు చేతు చూపిన వెంటనే కారు ఆపారు. విషయం తెలుసుకుని డిచ్‌పల్లి డివిజన్ విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాస్‌కు స్వయాన ఎమ్మెల్యే ఫోన్‌చేసి సమస్యను తీర్చాలని ఆదేశించారు. వెంటనే పనులు చేయడానికి స్తంభాలను తెప్పించారు. ఒక్క రోజులోనే పనులు పూర్తి చేస్తామని ఏడీ రైతులకు తెలపడంతో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, యువ నాయకులు బాజిరెడ్డి జగన్ మోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇందల్‌వాయి మండలంలోని వెంగళ్ పాడ్ శివారులో గతనెలలో రహదారిపై నుండి వెళ్తున్న విద్యుత్ వైర్లు లారీకి తగిలి 11కెవి వైర్లు, రెండు స్తంభాలు విరిగి పోయాయి. దీనిపై దాదాపు 40మంది రైతుల పంట పొలాలు ఉన్నాయని రైతులు వివరించారు. ఇదే విషయమై జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారుల వద్ద ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కృషితో ఇబ్బందులు తొలిగినట్లు రైతులు పేర్కొన్నారు. చుట్టు పక్కలఉన్న రైతులు ఇప్పటికే తూకాలు వేశారని, తమకు విద్యుత్ లేక వేయలేక పోయామని వారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి